న్యూ ఇయర్.. ఫుల్‌జోష్

సనత్‌నగర్: న్యూఇయర్ సంబరాలతో సనత్‌నగర్ నియోజకవర్గ వీధులు హోరెత్తాయి. 2022కు వీడ్కోలు చెబుతూ 2023ను ఆహ్వానిస్తూ ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట్, ఎస్‌ఆర్‌నగర్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో నూతన సంవత్సర ఆనందోత్సావాలు వెల్లివిరిశాయి. జెక్‌కాలనీ, సుందర్‌నగర్, మోడల్ కాలనీల్లోని పలు అపార్ట్‌మెంట్లలో వేడుకల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలతో హోరెత్తించారు.

హోటళ్లలో ఉర్రూతలూగించిన సంగీత కార్యక్రమాలు...

అమీర్‌పేట్‌లోని ఆదిత్యాపార్క్, గ్రీన్‌పార్క్, మ్యారీగోల్డ్, ఆదిత్యాహోమ్‌టెల్, సిల్వర్‌పార్క్, సితార రెసిడెన్సీ, రంగ్, బాటిల్స్ అండ్ చిమ్నీ, చిరాన్‌పోర్ట్ క్లబ్, మానససరోవర్ ది ఫెర్న్ తదితర హోటళ్లలో సంగీత కార్యక్రమాలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా పలువురు సెలబ్రిటీస్‌తో పాటు డీజేలు, యాంకర్లు తమ ప్రదర్శనతో యువతలో నూతనోత్తేజాన్ని కలిగించారు.

కంట్రీక్లబ్‌లో కోలాహలంగా నవోత్సవ వేడుకలు..

బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో జరిగిన ఆసియా బిగ్గెస్ట్ న్యూ ఇయర్ బాష్ 2023 వేడుక కోలాహలంగా సాగింది. అలోహా థీమ్ పేరుతో సాగిన ఈ వేడుకల్లో టాలీవుడ్ సినీ నటి స్నేహగుప్తా వంటి తారలతో జరిగిన నృత్య ప్రదర్శనలు..డీజే ఆసిఫ్ సంగీత హోరుతో యువతను హుషారెక్కించారు. కంట్రీ క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలీడేస్ సీఎండీ వై.రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త సంవత్సరం..సరికొత్త ఆశయాలతో సాగేందుకు కంట్రీక్లబ్ 15వ ఎడిషన్‌గా ఈ ఆనందాల వేడుక జరుపుకోవడం జరిగిందన్నారు.

ఈస్ట్ మారేడుపల్లిలో..

రాంగోపాల్‌పేట్: నూతన సంవత్సర వేడుకలను శనివారం సికింద్రాబాబద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా ప్రాంతాల్లో కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈస్ట్ మారేడుపల్లిలోని సెంటర్ ఫర్ విమెన్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో కార్పొరేటర్ దీపిక కేక్ కట్ చేసి మహిళల మధ్య కొత్త సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

జాహ్నవి కళాశాల ఆధ్వర్యంలో...

సికింద్రాబాద్ జాహ్నవి కాలేజ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉల్లాసంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

గాంధీ ఆస్పత్రిలో...

చిలకలగూడ: గాంధీఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో నూతన సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. న్యూ ఇయర్ కేక్ కట్ చేసి ఆటాపాటలతో సంబరాలు జరుపుకున్నారు. నూతన సంవత్సరంలో నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ రవీందర్, ప్రొఫెసర్ సత్యనారాయణ, తెలంగాణ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు, మైక్రోబయోలజీ హెచ్‌ఓడీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.



కంట్రీక్లబ్‌లో సందడిగా న్యూ ఇయర్ వేడుకలు



జాహ్నవి కాలేజ్ ఆధ్వర్యంలో..



డీజే అసిఫ్, నటి స్నేహాగుప్తాతో కంట్రీక్లబ్ సీఎండీ రాజీవ్‌రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న గాంధీ వైద్యులు



హుషారెక్కిస్తున్న డ్యాన్సర్లు

ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోండి

అడ్డగుట్ట: నకిలీ పత్రాలు సృష్టించి తమ స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ రిటైర్డ్ ప్రొఫెసర్ నగర సీపీ సీవి ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేసి తగు చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. సికింద్రాబాద్‌కు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ పరశురామ్ 1971లో తుకారాంగేట్ 125 గజాల స్థలాన్ని అప్పటి ఇంటి యజమాని నగభూషణం నుంచి సేల్ డీడ్(1182 బై 1971) చేసుకున్నారు. తుకారాంగేట్‌కు చెందిన పంపరి జనార్దన్ రిటైర్డ్ ప్రొఫెసర్‌కు చెందిన స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మించాడు. విషయం తెలుసుకున్న పరశురామ్ కుటుంబసభ్యులు తుకారాంగేట్‌లోని తమ స్థలం వద్దకు వెళ్లి ప్రశ్నించగా, సదరు స్థలం తనదని చెబుతూ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను చూపించాడని బాధితలు చెప్పుకొచ్చారు. స్థల ఆక్రమణకు పాల్పడి ఫోర్జరీ డ్యాకుమెంట్లు సృష్టించిన జనార్దన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకుంటామని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప చెప్పారు.

క్లుప్తంగా

ఓయూ గ్లోబల్ మీట్‌కు ఆర్ట్స్ కాలేజీ అలంకరణ



ఉస్మానియా యూనివర్సిటీ: నూతన సంవత్సరానికి స్వాగతం తెలుపుతూ 3, 4న జరిగే గ్లోబల్ అలుమ్ని మీట్-2023 కోసం ఓయూను ముస్తాబుచేశారు. అందులో భాగంగా ఆర్ట్స్ కాలేజీ భవనాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో ఆకర్షణీయంగా కనిపించేలా అలంకరించారు.

నాలాల సమగ్రాభివృద్ధికి కృషి

రాంగోపాల్‌పేట్: నాలాల సమగ్రాభివృద్ధికి పాటుపడుతూ వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎస్‌ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా సింధీకాలనీ నాలా పునర్నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన నాలా వంతెనలు ప్రస్తుతం నీటి ప్రవాహానికి సరిపోవడం లేదని, దీంతో వరద ముంపు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.20కోట్లతో వంతెన నిర్మాణ పనులు, కళాసీగూడ నాలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 12 మీటర్ల వెడల్పు ఉన్న వంతెనను 22 మీటర్లకు విస్తరిస్తున్నామని అలాగే 20 మీటర్ల వెడల్పుతో ఉన్న రోడ్డును 30 మీటర్లకు విస్తరిస్తున్నామన్నారు. ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తయితే రసూల్‌పూర, అన్నానగర్, బీహెచ్‌ఈఎల్, ఇక్రిశాట్‌కాలనీల్లో ముంపు సమస్యకు పరిష్కారం అవుతుందన్నారు. వాటర్ వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, ఎస్‌ఈ భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ సుదర్శన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

రాంగోపాల్‌పేట్: క్రీడలతో మానసిక వికాసం, శారీరక దృఢత్వం పెరుగుతుందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. శనివారం నెహ్రూ యువకేంద్రం హైదరాబాద్, యువ సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నల్లగుట్టలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, ఖోఖో పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. నెహ్రూ యువకేంద్రం, యువ సేవా సమితిలు చొరవ తీసుకుని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం పట్ల ఆమె అభినందించారు. యువ సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, కోఆర్డినేటర్ ప్రవీణ, సభ్యులు కిషోర్‌కుమార్, రోహన్, యశ్వంత్ సాయి పాల్గొన్నారు.

వన్‌టైం ఛాన్స్ రూ.10 వేల ఫీజును తగ్గించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో డిగ్రీ తప్పిన విద్యార్థులకు వన్‌టైం ఛాన్స్ రూ.10 వేల ఫీజును తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కేవలం ఒక్క సబ్జెక్టు రూ.10 వేలను వసులు చేయడం దారుణమని, విద్యార్థుల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఫీజును తగ్గించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ నేత రవినాయక్ తెలిపారు.

కనీవినీ ఎరుగని రీతిలో సనత్‌నగర్ అభివృద్ధి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పద్మశాలీలతో సమావేశమైన మంత్రి తలసాని

సనత్‌నగర్: కనీవినీ ఎరుగని రీతిలో సనత్‌నగర్‌ను అభివృద్ధి చేసినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో శనివారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. 60 ఏళ్ల నుంచి జరగని అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేళ్లలో జరిగాయని చెప్పారు. ఎంతోకాలం నుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ తొలగింపు సమస్య కూడా తాను వచ్చిన తర్వాతనే పరిష్కారమైన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విద్యుత్ లైన్ కారణంగా అనేక మంది ప్రాణాలను కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఐదు కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, తాగునీటి రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం సనత్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణతో పాటు డివైడర్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవేకాకుండా అన్ని కాలనీలు, బస్తీల్లో సీవరేజ్, వాటర్ సమస్యలను పరిష్కరించి రోడ్లు అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, పద్మశాలీ సంఘం అధ్యక్షులు నర్సయ్య, నారాయణ, సలహాదారు కేదారి, భద్రయ్య, కోశాధికారి చంద్రమౌళి, అప్పారావు, వేణు పాల్గొన్నారు.

ఆదయ్యనగర్‌లో మంత్రి తలసాని పర్యటన

పద్మారావునగర్: మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్‌లో శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, జలమండలి జీఎం రమణారెడ్డి, విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్ తదితరుతో కలిసి ఆదయ్యనగర్ బస్తీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రికి ఏకరువు పెట్టారు. 18 టెంపుల్ ప్రాంతంలో పవర్‌బోర్ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా మంత్రి తలసాని వెంటనే జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఇంద్రన్న

చిలకలగూడ: బీజేపీ నాయకుడు మ్యాకల ఇంద్రన్న తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఇంద్రన్నతోపాటు అనుచరులకు కండువ కప్పి బీఆర్‌ఎస్‌పార్టీలోకి ఆహ్వానించారు. భారత రాష్ట్ర సమితి అవలంభిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావు అన్నారు. సొంతగూటికి చేరడం తనకెంతో ఆనందంగా ఉందని, సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని మ్యాకల ఇంద్ర అన్నారు. మెట్టుగూడ కార్పొరేటర్ సునీత, సీనియర్ నాయకులు మ్యాకల హన్మంతరావు, సుంకు రాంచందర్, వంజరి సతీష్ పాల్గొన్నారు.

'చిల్లర రాజకీయాలతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు'



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుచిత్ర

బన్సీలాల్‌పేట్: చిల్లర రాజకీయాలతో డివిజన్‌లో ప్రజాభివృద్ధిని అడ్డుకుంటున్నారని రాంగోపాల్ పేట్ కార్పొరేటర్ సుచిత్ర అధికార పార్టీ నాయకులపై ధ్వజమెత్తారు. శనివారం పాన్‌బజార్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ హుందాతనాన్ని కోల్పోయి మాజీ కార్పొరేటర్ భర్త డివిజన్‌లో ప్రతిదీ రాజకీయం చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 5 ఏళ్ల పాటు డివిజన్ ప్రజలు ఓటుతో తమను ఆశీర్వదించారని.. ఆ విషయాన్ని మర్చి ప్రతి సందర్భంలో రాజకీయం చేస్తూ ప్రజా తీర్పును అవమానించే విధంగా అగౌరవపర్చే విధంగా వ్యవహారించడం సరికాదన్నారు. తాజాగా డివిజన్‌లోని మేకలబండ ప్రాంతంలో స్థానిక మహిళల విజ్ఞప్తి మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా కుట్టుమెషీన్లను ఏర్పాటు చేస్తుంటుంటే అధికార పార్టీ నాయకులు అడ్డుకున్నారని మండి పడ్డారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రొటోకాల్ ఇతరత్రా విషయాల్లో హుందాగా వ్యవహారిస్తున్నారని అయితే స్థానిక నాయకులు పలు విషయాలు, సందర్భాల్లో ఆయనను తప్పుద్రోవ పట్టిస్తున్నారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో డివిజన్‌లో పెద్ద ఎత్తున ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

కేలండర్ ఆవిష్కరణ



చిలకలగూడ: ఆకాంక్ష క్యాటరర్స్ అధినేత, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ సోముల ప్రకాశరావు సంయుక్తంగా స్వామివారి ముఖచిత్రంతో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక భక్తిభావాన్ని పెంపొందించే విధంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, ఆలయ ప్రతినిధులు రాజేష్‌సింగ్, టీఆర్‌టీ రాజేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత

రసూల్‌పురా: పేద విద్యార్థుల్లో క్రీడల పట్ల ప్రోత్సాహం అందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా క్రీడా పరికరాలు అందజేస్తున్నామని హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రకాష్ భాంటియా తెలిపారు. శనివారం కార్ఖానా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులకు వివిధ క్రీడా పరికరాలను బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి ప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ, షూష్ అందజేయడంతో పాటు వృద్ధుల, అనాథాశ్రమంలో ఉంటున్న వారికి నిత్యావసర సరుకులు, పండ్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు షద్రక్, సిరాజ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.